



“అమ్మా!...అమ్మా!!...” కాలేజీనుండి వస్తూనే తల్లిని పిలిచాడు రాజు పుస్తకాలక్కడే పడేసి నీరసంగా కుర్చీలో వాలిపోయాడు.

"రాజూ! అప్పుడే వచ్చేశావేం? అదేం అలాగున్నావ్?" సునీత వచ్చి కొడుకు ప్రక్కనే కూర్చుంది. "కాఫీ ఇవ్వనా?" అడిగింది.

"నాకిప్పుడేం వద్దమ్మా! కాని కొన్ని ప్రశ్నలకు సమాధానం కావాలి నాకు. ఈ రోజు ప్లీడరుగారబ్బాయి రమేష్‌కూ నాకు, పెద్ద గొడవైంది. నిన్ను నోటికొచ్చినట్టు మాట్లాడుతుంటే తుక్కు రేగ్గొట్టి వచ్చాను వాడ్ని!"

కంగారుపడిపోయింది సునీత. "అయ్యయ్యో కొట్టుకున్నారా? నీకేం దెబ్బలు తగల్లేదు కదా? అదేం పనిరా? ఎవరితోనూ గొడవలు పెట్టుకోవద్దన్నానా నిన్ను? ఇంటర్ చదువుతున్నావు ఆ మాత్రం ఇంగితం వుండక్కర్లేదూ నీకు? నన్ను తిడితే నాకు చెప్పాలి. నేను కనుక్కుంటాను కదా?"

"నేనేం చిన్నపిల్లాడిననుకున్నావా? నిన్ను ఏమన్నా అంటే చేతులు కట్టుకుండటానికి? ఆరాస్కెల్! నిన్ను ఎన్ని మాటలన్నాడని! నా చేతిలో కత్తి వుంటే వాడ్ని అక్కడికక్కడే నరికి పారేద్దును. నువ్వు ఎవరితోనో తిరిగిన మూలాన, నాన్నే నిన్ను వదిలేశాడట! వాళ్ళమ్మ చెప్పిందట! మీ జాతి బుద్ధులే అంత అన్నాడు. ఇన్ని మాటలంటే ఎలా ఊరుకుంటానమ్మా! అందరిలోనూ నాకెంత ఇన్‌సల్టు అనిపించిందో నీకేం తెలుసు? నిజం చెప్పమ్మా. నాన్న వున్నాడా నాకు? ఇప్పుడెక్కడ వున్నాడు? నా చిన్నప్పుడే సన్యాసులలో కలిసిపోయాడన్నావ్? వాడన్నమాటలన్నీ నిజమేనా? అలాంటి పని నువ్వెలా చేశావమ్మా?"

"రాజూ?..." గొంతు పెగల్చుకుని గట్టిగా అరిచింది సునీత. హడలిపోయి భయంగా తల్లి ముఖంలోకి చూశాడు. కోపంతో కందగడ్డలా తయారయ్యింది ఆమె ముఖం.

"ఎంతమాటన్నావురా! ఔను! నువ్వూ మగాడివేకదా? ఈ భావం నీ స్వభావంలోనే వుండివుంటుంది. ఒరేయ్ రాజూ! నీ తల్లి నీకలా కనిపిస్తుందిరా నీకు? ఏ తల్లీ కొడుకుచేత ఇలాంటి మాట పడి వుండదు. అలాంటి దౌర్భాగ్యం నాకుదుట వ్రాసివుందిరా! ఇంతకాలం

నీకు మీనాన్న గురించి నిజం చెప్పకపోవడం నాదే పొరబాటు. చెబితే నీ పసిమనసు ఎక్కడ నొచ్చుకుంటుందోనని దాచిపెట్టాను. కాని నీవు ఎదిగావు. నిజం దాచితే నీకు ఎన్నో అపోహలు కలుగుతాయి. నేను చెప్పేది విని నా పొరబాటెంత వుందో ఆలోచించి, తర్వాత నీఇష్టమొచ్చినట్లు మాట్లాడరా!"

పదహారేళ్ళక్రితం మాట.... నువ్వు ఆరునెలల పిల్లవాడిగా వున్నప్పుడు, బ్రతికున్నంతవరకు మర్చిపోలేని భయంకరమైన గతంలోకి దొర్లిపోయింది ఆమె మనసు....

గాలికి కిటికీ తలుపులు టపటపా కొట్టుకోవడంతో లేచి వెళ్ళింది సునీత. కిటికీలోంచి బయటకి చూసి వులిక్కిపడింది. భయంకర సమరానికి సిద్ధమౌతున్న సైన్యంలా హడావుడిగా వుంది వాతావరణం. కారుమేఘాలు దట్టంగా కమ్మేసివున్నాయి. ఈదురుగాలి, మధ్యలో కళ్ళు మిరుమిట్లుగొలిపే మెరుపులు! మాష్టారిచేత బెత్తం దెబ్బలుతిని, కాస్సేపటికో కాస్సేపటికో భోరున ఏడ్చే కుర్రాడిలా వుంది ఆకాశం. చూస్తుండగానే టపటపమంటూ వర్షం మొదలైంది. చప్పున కిటికీ రెక్కలుమూసి వచ్చి సోఫాలో కూర్చుంది. ఉయ్యాల్లో ఆరునెలల పసివాడు ఆదమరచి నిద్రపోతున్నాడు. రెండురోజుల క్రిందట భర్త శ్రీరాం ఆఫీసుపనిమీద క్యాంప్ వెళ్ళి ఆ రోజు తప్పక వచ్చేస్తానని చెప్పాడు. రోజూ రాత్రులు పనిమనిషివచ్చి సునీతకు సాయంగా పడుకునేది. కాని, ఆ రోజు మనవరాలికి జ్వరంగావుంది రావటం కుదరదనిచెప్పివెళ్ళిపోయింది. ఆకాశానికి చిల్లులుపడ్డట్టు కుండ పోతగా కురుస్తూంది వర్షం. బాబులేచి ఏడుపు మొదలెట్టడంతో వాడ్ని తీసుకొచ్చి ఒళ్ళో పడుకోబెట్టుకుని పాలివ్వసాగింది. పాలుతాగుతూనే తల్లిచీర తడిపేశాడు వాడు.

"అరెరే-ఎంతపనిచేశావ్‌రా బాబిగా! స్నానంచేసి ఇస్త్రీ చీర కట్టుకుని గంటకాలేదు...మళ్ళీ బట్టలు మార్చాలి-ఐనా నాదే పొర బాటు. రబ్బరుషీటు వేసుకోలేదు....పోనీలే పాలుకడుపునిండా తాగు" ప్రేమగా కొడుకు బుగ్గలు నిమురుతూ ముద్దుపెట్టుకుంది. వాడు నిద్ర పోతూనే తీసుకెళ్ళి వుయ్యాల్లోవేసి వెచ్చగా కప్పింది. బీరువాలో చీ

తీసి, బట్టలు మార్చుకుంటూంటే, తలుపు దబదబాశబ్దం అయ్యింది.
"ఎవరూ? "అడిగింది సునీత.

"నేనే" అని వినబడింది బైటినుండి. అలారంపీస్ చూస్తే పదిగంటలవుతోంది. సరిగ్గా ఎప్పుడూ భర్తవచ్చే టైము అది. "హమ్మయ్య ఆయన వచ్చేశారు!" అంతవరకు అనుభవించిన వంటరి తనం. భయంపోయి, మనసంతా ఆనందంతో నిండిపోయింది సునీతకు. తలుపు ఆగకుండా శబ్దం అవుతూంది. వర్షం కుండ పోతగా కురుస్తూంది. బట్టలు మార్చుకునేవరకు ఆగితే బైట నిలబడ్డ భర్త, తడిసి ముద్దయిపోతాడని లంగామాత్రం కట్టుకుని గబగబా వెళ్ళి తలుపు తెరిచింది.

అంతే....నెత్తిన పిడుగుపడ్డట్లు అదిరిపడింది. ఎదురుగా గళ్ళ లుంగీ, బనియను, బుర్రమీసాలు, నెత్తురు చిమ్ముతున్నట్లున్న క్రూర మైన కళ్ళు, నల్లతుమ్మ మొద్దులావున్న ఆజానుబాహుడు క్షణంలో లోనికొచ్చి, తలుపులు బిగించేశాడు. భయంతో పిచ్చిదానిలా అరవ బోయింది. కానీ గొంతుదాటి బైటికిరాలేదా కేక. "ఏయ్....ఏంటే.... గట్టిగా అరిచి నలుగుర్నీ పిలద్దామనుకుంటున్నావా? నువ్వెంత అరిచి గీపెట్టినా ఈ గదిదాటి బైటికిపోదు. నాపని అయ్యేవరకు కిక్కురు మనకుండా వుండు. మర్యాదగా నీ ఒంటిమీదున్న బంగారమంతా తీసి ఇచ్చెయ్యి. పిచ్చి పిచ్చి వేషాలేస్తే పీకలు తెగ్గోయటం నాకేం కొత్తగాదు...ఊ..."అంటూ హూంకరించాడతను.

సునీత పుట్టింట్లో అతి గారాబంగా పెరిగింది. ఒక్కతే సంతానం అవడంవల్ల అపురూపంగా పెంచారు. చీకటి గురించి, దొంగలగురించి వాళ్ళబామ్మ కథలు కథలుగాచెప్పి, విపరీతంగా భయ పెట్టేసింది! దానిమూలంగా చాలా పిరిగ్గా తయారయ్యింది ఆమె. ఇలాంటి సంఘటన తన జీవితంలో జరుగుతుందని గాని, తాను ఎదుర్కోవలసి వస్తుందని గాని ఆమె కల్లోకూడా వూహించలేదు. అతి భయంకరమైన సింహంముందు, ప్రాణాలరచేతిలో పెట్టుకుని, నిలబడ్డ జింకపిల్లలా గజగజా వణికిపోతూంది. ఒళ్ళంతా చెమట్లు పట్టేశాయి. లంగా జాకెట్టు మాత్రం వున్నాయి ఆమె ఒంటిమీద.

తన స్థితి గమనించే పరిస్థితిలో లేదామె. నిలువుగుడ్లేసుకుని అలాగే నిలబడిపోయింది.

అప్పుడు పరీక్షగా చూసాడతను. సునీత చూపరులను ఇట్టే ఆకట్టుకోగల అందం ఆమెది. లంగా జాకెట్టు తప్ప మరో ఆచ్ఛాదన లేని ఆమెనుచూసి కళ్ళు తిప్పుకోలేక పోయాడతను. అదురుతున్న పెదవులు, కళ్ళనిండా నీళ్ళు భీతహరిణిలా బెదురుచూపులు చూస్తున్న ఆమెనుచూసి, పిచ్చెక్కినట్లయింది అతనికి! కోర్కెతో చూస్తూ ఆమె దగ్గరగా వచ్చాడు. కళ్ళంటనీళ్ళు జల జలా రాలుతూండగా తన చేతి నున్న గాజులు తీయసాగింది సునీత.

"ఆగు! అవేమీ అక్కర్లేదు నాకు. నేను ఒకందుకొచ్చా నిక్కడికి. కాని అంతకుమించిందే దొరికింది నాకు. నిన్ను చూస్తుంటే మతిపోయింది! రా ...ఎవరికైనా తెలుస్తుందని భయపడకు. మనిద్దరికీ తప్ప మూడోకంటికితెలిసే అవకాశమేలేదు" సునీతను జబ్బ పట్టుకుని తనవేపు లాక్కున్నాడు. అనుకోని ఆ సంఘటనకు కెవ్వున అరిచింది. అతన్నుండి విడిపించుకోవాలని తన శక్తంతా వినియోగించి గింజు కుంది. కాని అతని బలంముందు ఆమె ఎందుకూ చాలకుండా వుంది. తనను పట్టుకున్న అతని చేతిని కసిదీరా కొరికింది. వెంటనే వదిలేశాడామెను. చేతినుండి రక్తం కారసాగింది. పట్టువదలగానే ఒక్క వుదుటున వంటగదిలో కెళ్ళిపోయి, లోన తలుపులు బిగించు కుంది.

కోపంతో, కసితో మరింత క్రూరంగా మారిపోయాడతను. "ఖబడ్దార్! నన్నే కరుస్తావు కదే!ఈరోజు నీ అంతు చూడందే ఇక్క డ్నుండి కదలను. తలుపు తీస్తావా విరగగొట్టి రమ్మంటావా?" వంట గది తలుపులు తన శక్తికొద్దీ నెట్టేస్తున్నాడతను. లోపల్నుండి సునీత పిచ్చిదానిలా అరుస్తూంది. ఆ అరుపులకు ఉయ్యాల్లో పిల్ల వాడు లేచి గుక్కపెట్టి ఏడ్వసాగాడు.

ఆ ఏడుపువిన్న అతనికి మెరుపులాంటి ఆలోచన కలిగింది. మరుక్షణంలో ఉయ్యాల దగ్గరకు వెళ్ళి పిల్లవాడ్ని ఓ చేతితో పైకి లేవదీసి, మరోచేతితో తన మొలనున్న కైజారుతీసి, "ఏయ్! ఇలా చూడవే!" కిటికీలోంచి ఆ దృశ్యాన్ని చూసిన సునీత గుండె ఆగి

పోయింది. "మర్యాదగా వచ్చి నాకు లొంగిపోయావా సరే! లేకపోతే నీ కళ్ళముందే వీడ్ని ముక్కలు ముక్కలుగా నరికి పారేస్తాను. మూడు లెక్కపెట్టేటప్పటికి ఇక్కడుండాలి నువ్వు! ఒకటి.... రెండు...." తలుపులు తెరుచుకుని ఒక్క ఉరుకులో వచ్చి అతనిముందు వాలింది సునీత. కన్నపాపానికి తన శీలాన్ని పణంగాపెట్టి బిడ్డను కాపాడుకుంది ఆమె.

తన పని ముగించుకొని తలుపులు తెరచుకొని చీకట్లో కలిసి పోయాడతను. శవంలా పడిఉంది సునీత. దగ్గర్లో పిడుగు పడ్డట్టుంది. చెవులు చిల్లులుపడేంత శబ్దం అవడంతో పిల్లవాడు కెవ్వున అరిచి ఏడుపు మొదలెట్టాడు. కొడుకు ఏడుపుకి కూడా ఆమెలో కదలిక లేదు.

ఇంతలో తలుపు నెట్టుకుని లోనికొచ్చాడు శ్రీరాం. "సునీ... ఎవరతను? ఇంత రాత్రప్పుడు మనింట్లో అతనికేం పని?" ఇంకా ఏదో అనబోతూ భార్యను చూసి ఠక్కున ఆగిపోయాడు. కింద పెదవి చిట్లి రక్తం కారుతూంది. చేతిగాజులు పగిలి పక్కంతా చెల్లాచెదురుగా పడివున్నాయి. అర్ధనగ్నంగా, అస్తవ్యస్తంగా పడి వుంది సునిత.

"సునీ....సునీ ఏమిటి? ఏమైంది?" భార్యను గట్టిగా కుదిపేస్తూ ఆదుర్దాగా అడిగాడతను. అప్పటికి ఆమెలో కొంచెం జీవకళ వచ్చింది. జరిగింది కలలోలాగా తను మరేదో లోకంలో వున్నట్లుగానూ అనిపిస్తూంది ఆమెకింకా. కానీ, తన దగ్గర్లో భర్తను చూసి, ఉయ్యాల్లో ఏడుస్తున్న కొడుకు ఏడుపు విని పూర్తిగా స్పృహలోకొచ్చి ఈ లోకంలోకొచ్చి పడింది. వచ్చి భర్తను చుట్టుకునిపోయి భోరున ఏడవలేదు. అతని కాళ్ళు పట్టుకుని తన తప్పు కాయమని బ్రతిమాలుకోలేదు. ఆమె కంట్లో నీటి చుక్కలన్నీ ఎప్పుడో ఆవిరైపోయినాయ్ మనస్సంతా ఖాళీగా వుండిపోయింది. నెమ్మదిగా జరిగిందంతా చెప్పింది.... శ్రీరాంకు మతిపోయినంత పనైంది. వెంటనే అంత హోరుగాలిలోనూ వీధిలోకి పరుగెత్తాడు. అన్ని ప్రక్కలా ఫర్లాంగు దూరం వెదికినా, ఆ మనిషి జాడలేదు. తిరిగి ఇంటికి చేరుకున్నాడు శ్రీరాం. అప్పటికి స్థిమితపడి లేచి కొడుకు నెత్తుకుని కూర్చుంది సీత.

పీళ్ళుకారుతూన్న బట్టలతో వచ్చి కుర్చీలో కూలబడ్డాడు. "ఎవరో ఏమిటో సరిగ్గా తెలుసుకోకుండానే తలుపులు తీసెయ్యడ మేనా?" మాట్లాడలేదు సునీత. "చుట్టుపట్ల ఇన్ని ఇళ్ళున్నాయికదా, గట్టిగా అరిచి గోలచెయ్యలేదా?" దానికీ మాట్లాడలేదామె.

"ఇద్దరు ముగ్గురైతే నీవల్లగాదు. ఒక్కడిని ప్రతిఘటించలేక పోయావంటే నమ్మలేకపోతున్నాను...." రెప్పవాల్చడం మర్చిపోయి భర్తముఖంలోకి ఆశ్చర్యంగా చూస్తూండిపోయింది.

"ఈ విషయం ఎవరికైనా తెలిస్తే ఎంత అప్రదిష్ట? నన్నెంత చులకనగా చూస్తారు? ఇదేం ఫారిన్‌కాదు. మన హిందువుల్లో ఆడ దానికి శీలం ఎంత పవిత్రమైనదో, దాన్ని ప్రాణం ఒడ్డయినాసరే ఎలా కాపాడుకుంటారో నీకు తెలియందేంకాదే?" భర్త స్వభావం అర్థ మయి, అతని నిజస్వరూపం కళ్ళారా అప్పుడే చూస్తూ నిశ్చేష్ట అయింది ఆమె.

"ఏం మాట్లావేం? గుడ్లప్పగించి అలా చూస్తున్నావ్? నీశీలం ముందు నెలలపసిగుడ్డు ఎక్కువైనాడా? వీడుపోతే మరొకర్ని కనొచ్చు! శీలంపోయాక తెచ్చుకోగలవా?" అన్నాడు భర్త పళ్ళు బిగించి.

## ఇక్కడితో ఈ కథ ఆపుతున్నాం

"బిడ్డపోతే మళ్ళీ బిడ్డని కనవచ్చు. శీలంపోతే మళ్ళీ శీలం వస్తుందా?" అంటాడు ఆమె భర్త. శీలం అర్పించి కన్న బిడ్డ ప్రాణాలు కాపాడుకోవలసి వచ్చింది," అంటుంది ఆ యిల్లాలు.

స్త్రీకి శీలం ముఖ్యమా? కన్నబిడ్డ ముఖ్యమా?

మగాడికి తన భార్య శీలం ముఖ్యమా? తన కన్నబిడ్డ ప్రాణాలు ముఖ్యమా?

సహేతుకమైన సమర్థన యీ అంశంపై చేయవల సిందిగా పాఠకులను కోరుతున్నాం.

ఏ సమర్థనా పదివాక్యాలకు మించకుండా వుండాలి. ఎన్నిక కాబడ్డ సమర్థనలకు ఒక్కొక్కదానికి 50 రూ. పంపగలం.

సంపాదకుడు.